క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శలు



గజ్జరంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని పలువురు నాయకులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డీనేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు. గజ్జరం గ్రామానికి చెందిన ఖండెల్లి రమణ తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి రాంబాబు, ఎంపీటీసీ గుంటు చిన్నబ్బాయి, వైఎస్సార్ సీపీ నాయకులు గన్నిన రత్నాజీ, పిట్టా శ్రీనివాస్, నూతంగి సురేష్, చిక్కాల మహేష్, ఎల్లిన శ్రీను, దుర్గారావు తదితరులున్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

దేవరపల్లి: నిరుద్యోగ యువతీ, యువకులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్టు దేవరపల్లి ఎంపీడీఓ వై.రాజారావు తెలిపారు. శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ నెల 21 నుంచి గోపాలపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న స్కిల్ హబ్ నందు కంపూటర్ కోర్సుల ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. పదో తరగతి పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు స్కిల్ హబ్‌కు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కోర్సుకు సంబంధించిన వివరాలకు ఎస్.సత్యశ్రీనివాస్, కోఆర్డినేటర్, సెల్ నంబర్ 84999 43366కు సంప్రదించాలన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం



వృద్ధురాలికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సంస్థ సభ్యులు

తాళ్లపూడి (కొవ్వూరు): తాళ్లపూడి మండలంలో మానవత సంస్థ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం వృద్ధురాలుకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నిలువ నీడలేక, పోషణకు, మందుల ఖర్చులకు ఇబ్బంది పడుతూ, పెన్షన్ కూడా పొందలేని స్థితిలో ఉన్న కొవ్వూరు మండలం చిడిపి గ్రామానికి చెందిన కావూరి మాణిక్యంకు సంస్థ ఆధ్వర్యంలో రూ.6 వేలు ఆర్థికసాయం, ఉచిత మెడికల్ కిట్‌ను అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ సభ్యుల సమక్షంలో అందించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సనపల రాజశేఖర్, జి.మునేశ్వరరావు, వి.చంద్రయ్య, కవల శ్రీనివాస్, రామ్మోహన్, వెంకటేశ్వరవు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతికి సంకటహరచతుర్థి పూజలు

గోపాలపురం: మండల కేంద్రంలోని స్థానిక శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో సోమవారం సంకట హర చతుర్థి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు కందగిరి గౌతమ్‌శర్మ తెలిపారు. కార్యక్రమానికి పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ సంజీవని

నిడదవోలు: సీఎంఆర్ఎఫ్ పేదల ఆరోగ్యానికి సంజీవని లాంటిదని, తద్వారా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక మంత్రి పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని 30 మంది బాధిత లబ్ధిదారులకు రూ.22.94 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మరో ముగ్గురికి రూ.8 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను అందజేశారు. పట్టణంలోని తీరుగూడెం, పందలపర్రు, విజ్జేశ్వరం, పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంత్రి దుర్గేష్ పంపిణీ చేశారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన శ్రీ వాసవి అమ్మవారు



శ్రీవాసవి అమ్మవారిని శాకంబరిగా అలంకరించిన భక్తులు

ఉండ్రాజవరం: మండల కేంద్రం ఉండ్రాజవరం గ్రామంలో ఆర్య వైశ్య సేవా సంఘం భవనంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు సోమవారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సంఘ సభ్యులు అమ్మవారిని కూరగాయలతో శాకాంబరి రూపంలో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పొలాల్లో పట్టాలు- లబ్ధిదారుల కష్టాలు

- పట్టాలిచ్చి పట్టించుకోవడం మానేశారు
- పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తున్న స్థలాలు
- మౌలిక వసతుల గుండు సున్నా
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి



ఖండవల్లిలో గృహ నిర్మాణాలు జరగక ఖాళీగా ఉన్న ఇండ్ల స్థలాలు



పెరవలిలో అసంపూర్తి నిర్మాణంతో ఉన్న ఇండ్లు



ఇండ్ల స్థలాల్లో మొలిచిన మొక్కలు

పెరవలి: వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఎన్నికల హామీల అములలో భాగంగా పేదలకు ఇండ్ల స్థలాలను కేటాయించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాది కాలం అవుతున్నా ఆ స్థలాల్లో సంబంధించి పనులను ప్రారంభింకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 8,237 మందికి పట్టాలు ఇచ్చి స్థలాలు కేటాయించారు. ఇందులో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 4,380 మందికి ఇండ్ల స్థలాలను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఇళ్లు మంజూరు చేయకపోవటంతో లబ్ధిదారులు స్థలం ఉన్నా ఉపయోగం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఎప్పుడు మెరక చేస్తారో తెలియక, కట్టుకున్నచోట్ల మౌలిక వసతల కల్పన లేక, సమస్యల వలయంగా మారిందని పలువురు లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వాలు మారితే పేదలను ఇబ్బందులకు గురిచేయడం తగునా అని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లు కట్టుకోవాలని అధికారులు లబ్ధిదారుల చుట్టూ తిరిగితే, నేటి కూటమి ప్రభుత్వంలో అధికారుల చుట్టూ లబ్ధిదారులు తిరిగినా ఫలితం లేకుండా పోతుందని దీనంగా చెప్పుతున్నారు. గత ఏడాది ఇళ్లు మంజూరు చేసి ఉంటే ఈ సమయానికి నిర్మాణాలు వేగంగా జరిగేవని, వర్షాకాలంలో ఇండ్లు ఎలా నిర్మించుకోవాలని వాపోతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

వచ్చే ఏడాది ఇండ్లు మంజూరు చేస్తారో లేదో తెలియటం లేదని, ఇచ్చినా నిర్మాణ ముడి సరుకులు ధరలు చుక్కలనంటుతున్నాయని, ఏలా నిర్మించుకోగలమని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రస్తుతం ధరలు అందుబాటులో ఉండటంతో పాటు ఇసుక కూడ ధరలు తగ్గాయాని ఈ పరిస్థితుల్లో ఇండ్ల నిర్మాణాలు జరగకపోతే తాము ఇండ్లు నిర్మించుకోలేమని బాధను వెల్లబోస్తున్నారు. నియోజకవర్గంలో జగనన్న కాలనీల పేరుతో 8,237 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారని కాని వాటి నిర్మాణానికి కార్యచరణను ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని దీంతో సోంతింటి కల ఎప్పుడుకి నేరవేరుతుందో తెలియక అద్దె ఇండ్లల్లో కాలం వెల్లదీస్తున్నామని వాపోతున్నారు.

వర్షం వస్తే నరకమే..

పట్టాలు ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణానికి రంగంలోకి దిగితే లబ్ధిదారుల కష్టాలు మాములుగా లేవు. ఏడాది కావుస్తున్నా కాలనీల్లో మెరక చేయలేదు. చెప్పాలంటే వీటి సంగతినీ ప్రభుత్వం ఎప్పుడో పట్టించుకోవడం మానేసింది. కనీసం అధికారులైనా ఇక్కడ లబ్ధిదారుల పడుతున్న అవస్థలను పట్టించుకుంటే కాస్తయినా మేలు జరుగుతుంది. పలు చోట్ల పల్లపు ప్రాంతాలు, పొలాలను కేటాయించడంతో ఎత్తులో ఇళ్లను నిర్మించుకోవాలంటే గృహనిర్మాణ పథకంలో ఇచ్చే రూ.1.80 లక్షలు బేస్‌మెంట్‌కే సరిపోదని పేర్కొంటున్నారు.

మౌలిక వసతుల వెక్కిరింపు

దశాబ్ద కాలంగా అద్దె ఇళ్లలో నివసిస్తూ సొంత ఇంటి నిర్మించుకుని వెళ్లిన లబ్ధిదారులకు కాలనీల్లో సమస్యలు వలయంగా చుట్టుముట్టాయి. మంచినీరు, డ్రైన్లు, విద్యుత్ సౌకర్యాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలాల వారీగా లబ్ధిదారులు

మండలం	స్థలాలు	ఇండ్ల మంజూరు	నిర్మించి కున్నవి
పెరవలి	2,715	601	403
ఉండ్రాజవరం	2,610	2,065	921
నిడదవోలు	2,912	2,254	571
	8,237	4,380	1,901

ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నాం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇండ్ల స్థలాన్ని కేటాయించారు. ఇళ్లు మంజూరు నేటికీ అవ్వలేదు. లేదంటే ఇప్పటికే నిర్మించుకునేవాళ్లం. ఏడాది కాలంగా మంజూరు కోసం ఎదురు చూస్తున్నాను.

– చిన్నం సత్తిపండు, లంకమాలపల్లి

ఆర్థిక ఇబ్బందులతో సతమతం



ఖండవల్లిలో 530 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు కేటాయించారు, నేటికీ ఒక్క ఇళ్లు మంజూరు కాలేదు. పేదలను ఇంకా ఆర్థికంగా ఇబ్బందులు గురి చేద్దామనా ఏమిటి.? ఇళ్లు మంజూరు చేస్తే చాలా మంది నిర్మించుకుని సొంత ఇంటి కల నెరవేరేది.

– బొక్కే వెంకటేశ్వర్లు, ఖండవల్లి

రోడ్ల నిర్మాణం జరగక ఇంటి నిర్మాణానికి మెటీరియల్ తరలించడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కుటుంబ పెద్దను కోల్పోవడం బాధకరం



లక్ష్మీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: కుటుంబ పెద్దను కోల్పోవడం బాధకరమైన విషయామని నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు హితవు పలికారు. మండలంలోని పాలంగి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దొడ్డా సూర్యనారాయణ తల్లి లక్ష్మీ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పరామర్శించారు. ఈ మేరకు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి శరత్‌బాబు, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, వైసీపీ మండల నాయకులు నాగిరెడ్డి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉండ్రాజవరంలో మన్నె బదిరి నారాయణ తల్లి సత్యవతి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను శ్రీనివాస్‌నాయుడు పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెండే వెంకట్రావు, సింహాద్రి శ్రీనివాసు, నిమ్మల శ్రీనివాసు, కరుటూరి కాశీవిశ్వనాథం, మారిశెట్టి నాగేశ్వరరావు, దోనేపూడి సుధాకర్, దువ్వాపు సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యను అందజేసిన ఘనత వైఎస్సార్‌దే



గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పుస్తకాలు అందజేస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: పేద విద్యార్థులకు ఉన్నత చదువులు భారం కాకూడదని భావించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో పేద కుటుంబాలకు మేలు జరిగిందని కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని గజ్జరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. తండ్రి బాటలో తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడులో ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి బాటలో నడిపించారన్నారు. బాల్యంలో విద్యకు ఎవరు దూరం కాకూడదని అమ్మ ఒడి పథకం ప్రవేశ పెట్టారన్నారు. ఏటా తల్లుల ఖాతాలో రూ.15 వేలు జమ చేయడంతో తల్లుల మనస్సు గెలిచిన పథకం కాబట్టే ప్రస్తుత ప్రభుత్వం కోతలు పెట్టి అయినా అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరావు, గ్రామ సర్పంచ్ గండి రాంబాబు, రాష్ట ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు గన్నిన రత్నాజీ, ఏల్లిన శ్రీను, ఎలిపే రాజు, వినంద, చిక్కాల మహేష్, కొయ్యే దుర్గా రావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



శిక్షణలో పాల్గొన్న నల్లజర్ల మండల ఉపాధ్యాయులు

నల్లజర్ల: విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలు పెంపునకు విద్యాశాఖ, సమగ్రశిక్షా సంయుక్తంగా చేపట్టిన సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్) కార్యక్రమానికి నల్లజర్ల మండలం నుంచి 8 మంది హెచ్‌ఎంలు హాజరైనట్టు డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి తెలిపారు. ఉపాధ్యాయులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం రాజానగరం మండలం సాయి మాధవి ఇంజీనీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు జరుగుతుందన్నారు. తూర్పు చోడవరం హైస్కూలు హెచ్‌ఎం గోపి గోవర్ధన్ రీసోర్సు పర్సన్‌గా వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు. సమర్థవంతంగా పాఠశాల నిర్వహణకై ప్రధానోపాధ్యాయులు అనుసరించాల్సిన అంశాలు ఈ శిక్షణలో వివరిస్తారన్నారు. స్వీయ అవగాహన, నిర్వహణ, అభ్యాసన సంస్కృంతిని ప్రోత్సహించడం, పరిశీలన, అభిప్రాయం, డేటా ఆధారిత దిశలు, పాఠశాల వనరుల నిర్వహణ, ఆర్థిక వనరుల నిర్వహణ, కమ్యూనికేషన్స్ ప్రభావం, సంఘర్షణ నిర్వహణ, సహకారాన్ని నిర్మించడం వంటి అంశాలలో ఈ శిక్షణ ఉంటుందన్నారు.

అర్జీలదారుల సమస్యలను పరిష్కరించాలి



కొవ్వూరులో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): మీ కోసం కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తప్పనిసరిగా హాజరై ఫిర్యాదుదారుల నుంచి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అధికారులు ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'పీజీఆర్ఎస్ – మీ కోసం' వేదికలో ఆమె పాల్గొని వినతులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం 17 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ మేరకు వారంలో రెండు రోజులు ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లా అధికారి, డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించి అర్జీలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మీ కోసంలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, వారు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

నల్లజర్ల: మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎంపిక సోమవారం తెలికిచెర్ల డి.జోసెఫ్ చర్చిలో జరిగింది. ఈ కార్యక్రమానికి పాస్టర్ రాజ్‌కుమార్ అధ్యక్షత వహించగా మండలశాఖ అధ్యక్షుడిగా డి.జోసెఫ్, కార్యదర్శిగా యస్.సురేష్, కోశాధికారిగా కె.రాజు ఎంపికయ్యారు. వీరితో రాజ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షుడిగా యం.రాజు, యం.ప్రసాద్, కె.తిమోతి, కార్యవర్గ సభ్యులుగా టి.విజ్రా, సిహెచ్.సురేష్, ప్రేమ్‌కుమార్ ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డి.శ్యాంబాబు, యం.జోజి, సియోను కుమార్, యం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన నృత్య కళలను ప్రోత్సహించాలి



కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో మంత్రి దుర్గేష్, పోతల పావని తదితరులు

నిడదవోలు: అంతరించిపోతున్న కూచిపూడి, భరత నాట్యం వంటి ప్రాచీన కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన భ్రామరి కూచిపూడి నాట్య నిలయం వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు శ్రోతలను అలరించాయి. ఈ మేరకు చిన్నారుల ప్రతిభను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, భ్రామరి కూచిపూడి నాట్య నిలయం వ్యవస్థాపకురాలు పోతల పావని, డాక్టర్ తోపరాల కళ్యాణ చక్రవర్తి, పెన్మత్స చందు, పాటే అయ్యప్ప, జెడ్పీటీసీ సభ్యులు సూరిబాబు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్, కార్యదర్శి దారపు రెడ్డి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రజాప్రతినిధిపై దాడి దారుణం



గడా జగదీష్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

దేవరపల్లి: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై ఇటీవల టీడీపీ గూండాల రాళ్ల దాడి చేసి భయభ్రాంతులకు గురి చేయడం దారురణమని వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్ మండిపడ్డారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మహిళా ప్రజా ప్రతినిధులపై రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్యగా వర్ణించారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న దారుణాలు చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? అని ఆయన ప్రశ్నించారు. పోలీసుల సమక్షంలోనే టీడీపీ గూండాలు బీసీ మహిళా ప్రజా ప్రతినిధిపై దాడి చేసి, కారు అద్దాలు ధ్వంసం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై రోజురోజుకు లైగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నా, కూటమి ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఆమెకు పార్టీ కార్యకర్తలు అండగా నిలబడతామని తెలిపారు. ప్రజా ప్రతినిధికి రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను మానుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టిపెట్టాలని ఆయన హితవు పలికారు.

మాజీ సర్పంచ్ మృతి



కరుటూరి సూర్యారావు (ఫైల్)

దేవరపల్లి: దుద్దుకూరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కరుటూరి సూర్యారావు (85) సోమవారం ఆయన స్వగృహంలో తుది శ్వాస వీడిచారు. వృద్ధాప్యం కారణంగా ఆరోగ్య సమ్యసలతో బాధపడుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన 1970 నుంచి 1975 వరకు సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి పాటుపడ్డారని గ్రామస్తులు పేర్కొన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఉచితంగా కృత్రిమ అవయవాలు అందజేస్తాం



వేళ్లచింతలగూడెంలో దివ్యాంగుడికి వీల్ చైర్‌ను అందచేస్తున్న ఏఎస్‌వో వెంకటేశ్వర రావు, సభ్యులు

గోపాలపురం: దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో కాళ్లు చేతులు లేని దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయువాలు అందిస్తామని గోపాలపురం తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగి ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు కుక్కల గంగాజలంకు వీల్‌చైర్‌ను అందజేశారు. అర్హులైన దివ్యాంగులు 93910 89381 నంబరును సంప్రదిస్తే వారికి ఉచితంగా అవయవాలు అందజేస్తామన్నారు. ఆయన వెంట సంస్థ సభ్యులు పత్తిపాటి నాగరాజు, సీఆర్‌పీ కొయ్య నాగరాజు, కె కీర్తికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు ట్రాక్టర్ బోల్తా



క్షతగాత్రులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

దేవరపల్లి: దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో బేళ్లు దింపిన ట్రాక్టర్ తిరిగి రామన్నపాలెం వెళ్తుండగా మార్గమధ్యలో సోమవారం రాత్రి అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న బి.నాగరాజు, కిషోర్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కి సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

రాయితీపై సోలార్ పరికరాలు అందజేత

చాగల్లు: మండల విద్యుత్ వినియోగదారులకు పీఎం సూర్యాఘర్ పథకంలో భాగంగా రాయితీపై సోలార్ పరికరాలను అందిస్తున్నట్లు విద్యుత్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు సోమవారం తెలిపారు. సోలార్ పథకం రాయితీలో భాగంగా 1కేవీ యూనిట్‌కు రూ.30 వేలు, 2కేవీ యూనిట్‌కు రూ.60 వేలు, 3కేవీ యూనిట్‌కు రూ.78 వేలు రాయితీ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల (బీసీ) వినియోగదారులకు ఈ రాయితీకి సంబంధించి అదనంగా రూ.20వేలు రాయితీతో అందిస్తున్నట్లు వెల్లడించారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు కోసం ధర్నా

సీటీఆర్ఐ (రాజమండ్రి సిటీ): ప్రభుత్వ భూమికి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌ని రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు మండవ దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా పేదలను ఇబ్బంది పెడుతున్న కేసులో ప్రభుత్వం ఇంప్లీడ్ పిటీషన్ వేసి న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. గోకవరం మండలం గంగంపాలెంలో పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ ఎల్సీసీ భూమి 1993 నుంచి ఇప్పటి వరకు సుమారు 37 కుటుంబాల వారు సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూములకు పట్టాలు ఇవ్వాలని ఆందోళన చేసి హైకోర్టును ఆశ్రయించామన్నారు. వారందరికీ ప్రభుత్వం పట్టాలను కూడా మంజూరు చేసిందన్నారు. కొందరు అధికారులు పేదలకిచ్చిన భూములను జిరాయితీ భూములుగా చూపించి, ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ధర్నా కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గోపాలపురం: గోపాలపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గెల్లా రాజీమనోహర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల తీరు, చేపట్టవలసిన పనులపై చర్చిస్తారని కావున మండలంలోని అన్ని శాఖాల అధికారులు, కార్యదర్శులు తప్పకుండా హాజరై గత సమావేశంలో చేసిన తీర్మాణాలకు సంబంధించి పురోగతిని వివరించాలని ఎంపీడీవో ఆదేశించారు.